క్లుప్తంగా

ఈద్ శుభాకాంక్షలు

– ఆర్డీవో మోహనరావు

రాజంపేట : బక్రీద్‌పండుగ సందర్భంగా గోవులకు హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని రాజంపేట రెవిన్యూ డివిజనల్ అధికారి మోహనరావు ఆదేశించారు. శనివారం సబ్‌కలెక్టరేట్ చాంబరులో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు పీస్ కమిటి సమావేశం నిర్వహించామన్నారు. సామరస్యంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. టౌన్ ఎస్ఐ మోహన్ గౌడ్, తహసీల్దారు ఇన్బురాజన్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

బక్రీద్‌ను సామరస్యంగా జరుపుకోవాలి


ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రమోహన్

వీరబల్లి : మండలంలోని ముస్లింలు బక్రీదు పండుగను సామరస్యంగా జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ముస్లింలకు పోలీస్ స్టేషన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీదు పండుగను సోదర భావంతో సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా మతపెద్దలు బాధ్యత వహించాలన్నారు.

వైభవంగా చండీహోమం


చండీ హోమంలో పాల్గొన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మతల్లి ఆలయంలో పొంగళ్ల మహోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమానికి మహిళలు పెద్దఎత్తున పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆకేపాటి అమర్నాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గుండుమల్లికార్జున రెడ్డి, ఉపసర్పంచ్ ఇబ్బు, ఆనాల మధు యాదవ్, పెనుబాల నాగసుబ్బయ్య, గుండు గోపాల్ రెడ్డి, దుర్గా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాలర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రతోట బాలసిద్దుజీరావు (74) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శనివారం అంబేడ్కర్ నగర్‌లో బాలసిద్దుజీరావ్ మృతదేహాన్ని సందర్శించి నివాలర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పై శిక్షణ

రాజంపేట రూరల్ : నాన్ కమ్యూనికేబుల్ డీసీజేఎస్ ప్రోగ్రామ్ క్రింద ఏరియా ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌లు, సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలకు శనివారం క్యాన్సర్ స్క్రీనింగ్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 13 నుంచి జూలై 13వ తేది వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శిక్షకులు ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివప్రసాద్, ప్రణయ్, మస్తాన్ తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ అశ్వినీచంద్ర, సీనియర్ అసిస్టెంట్ యు సిద్దిరామయ్య, క్యాన్సర్ కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ మేనేజర్‌కు సన్మానం


ఏపీజీబీ మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని చక్రంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి బ్యాంక్ బిల్డింగ్ యజమాని సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాహుల్, క్యాష్ ఆఫీసర్ తనూజ పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే వేణుగోపాలుడు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం


వేణుగోపాలుడి మూల విరాట్

నేటి నుంచి పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు


జిలకల సుబ్బయ్య, ఆలయ చైర్మన్


చెంచు సుబ్బయ్య, గ్రామ పురోహితుడు

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలో వెలసిన వేణుగోపాలస్వామి ఉత్సవాలు నేటి నుంచి పది రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ చైర్మన్ జిలకల సుబ్బయ్య తెలిపారు. ఆదివారం నుంచి పదిరోజులపాటు ఒక్కొక్క కులానికి చెందిన ఒక్కొక్కరు ఒకరోజు ఉభయదాతలుగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం అంకుకార్పణ (వర్తక సంఘం వారు), 17న ధ్వజారోహణ వడియ సంఘం వారు (వడ్డెరులు), 18న శేషవాహనం నాయుడు సంఘం వారు, 19న సింహవాహనం పంచేటి వారు, 18న హనుమంతు సేవ రెడ్డి సంఘం వారు, 21న గరుడ సేవ, ముదిరాజ్ సంఘం వారు, 22న కళ్యాణోత్సవం గౌనేని వారు, 23న రథోత్సవం బలిజసంఘం వారు, 24న అలకలదోపు ఆర్యవైశ్య సంఘం వారు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ప్రతిరోజు రాత్రి హరికథా కాలక్షేపం ఉంటుంది. పెనగలూరు మండలంతో పాటు ఇతర మండలాల నుంచి కూడా భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకోనున్నారు.

ఏర్పాట్లు పూర్తి.....

బ్రహ్మోత్సవాలకు ఆలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ జిలకల సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. హరికథా కాలక్షేపానికి తిరుపతి, రాజమండ్రి, గండి తదితర ప్రాంతాల నుంచి హరిదాసులు కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

‘ఈద్’కు సర్వం సిద్ధం

ఈద్గాలలో చేపట్టనున్న ప్రత్యేక ప్రార్థనల సమయాలు

ప్రాంతం	నమాజ్ సమయం
పట్టణంలోని పాత ఈద్గా	ఉదయం: 7.30
మన్నూరు ఈద్గా	ఉదయం: 7.30
జానీబాషాపురం ఈద్గా	ఉదయం: 7.30
బ్రాహ్మణపల్లె పెద్ద ఈద్గా	ఉదయం: 8.00
ద్వారకానగర్ ఈద్గా	ఉదయం:8.30
పోలి ఈద్గా	ఉదయం: 8.30
రహమతీయ మసీదు	ఉదయం: 7.00


ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన రాజంపేట పట్టణంలోని పాత ఈద్గా

రాజంపేట టౌన్ : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈద్‌ను పురస్కరించుకొని ముస్లింలు ఈద్గాలలో విధిగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అందువల్ల మండలంలోని అన్ని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఆయా ఈద్గా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కాగా పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా ఈద్గా కమిటీలు ప్రత్యేక ప్రార్థనల సమయాన్ని నిర్ణయించాయి.

పండుగ ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలి

- శానిటేషన్, నీటిసరఫరాలపై సత్వర చర్యలు
- మున్సిపల్ కమిషనర్ వాసుబాబు


బక్రీద్ ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్ : ఈనెల 17,18,19 తేదీలలో నిర్వహించనున్న బక్రీద్ పండుగ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను కమిషనర్ వాసుబాబు ఆదేశించారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బక్రీద్‌పండుగను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని చేపడుతున్న ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాతో పాటు అన్ని మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలంటూ కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన శాంతికమిటీ సభ్యులు, మతపెద్దల సూచనల మేరకు పట్టణంలోని బండ్లపెంట, ఫ్రూట్స్‌మండీలు, మార్కెట్ యార్డులలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక జంతువధ శాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జంతువధ శాలల వద్ద సరైన రీతిలో పారిశుధ్య పనులను చేపట్టడంతో పాటు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ, మంచి వాతావరణంలో పండుగ నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకరించాలంటూ ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, వార్డుసచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి నిలయాలు


పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్న ఉపాధ్యాయులు

సిద్దవటం : ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి నిలయాలని, మీ పిల్లల భవిష్యత్‌కు తాము పునాదులు వేస్తున్నామని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమీర్‌భాషా, నరసింహులు, రవిశంకర్ అన్నారు. సిద్దవటం మండలం లోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం శనివారం మండలం లోని మూలపల్లె, వంతాటిపల్లె, భాకరాపేట, కొమ్మనియినిపల్లె, మాధవరం–1 గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈఏడాది నుంచి తమ పాఠశాల హైస్కూల్ ప్లస్ అయిందని, ఇక్కడ ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం తరగతులను నిర్వహిస్తామన్నారు. తమ పిల్లలను కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంతే గాకుండా ఈ పాఠశాలకు పీఎం శ్రీ యోజన కింద ఎంపికైయిందని, భవిష్యత్‌లో అనేక రకాల సౌకర్యాలు, వసతులు (సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, మంచి ఆటస్థలం, అదనపు తరగతి గదులు)కల్పించ బడతాయని తెలియజేశారు. సంవత్సరం తమ పాఠశాలలోని 10వ తగరతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వాటిని బలోపేతం చేయాలని తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, పోతులూరయ్య, విజయశ్రీ, రాజమ్మ, పరమేశ్వరి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం గ్రామం, జంగంపల్లిలో వెలసిన శ్రీ మరినమ్మ తిరుణాల ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. చాందినీ బండ్లు, కోలాటాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.

‘ఉపాధి’ డబ్బులు రాక ఇక్కట్లు


కడపాయపల్లెలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

సిద్దవటం : ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బులు మంజూరు చేయాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం లోని కడపాయ పల్లె గ్రామ సమీపం లోని కుంటలో శనివారం ఉపాధి హామీ కూలీలు పూడిక తీతపనులను చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తాము పనిచేసిన దినములకు రోజువారి కూలి డబ్బులు మంజూరు కాక దాదాపు 6 వారాలు కావస్తోందన్నారు. ఉపాధి హామీ పనులను నమ్ముకొని జీవనాన్ని కొనసాగిస్తున్నామన్నారు. అధికారులు స్పందించి తమకు రావలసిన కూలీ డబ్బులను మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై ఉపాధి హామీ పథకం ఏపిఓ నరసింహులును వివరణ కోరగా నివేదికను అధికారులకు పంపించామన్నారు. కూలి డబ్బులు మే నెల మొదటి వారం వరకు చెల్లించామని, మిగతా రావాల్సిన కూలీల డబ్బులు మంజూరు కాగానే వారి అకౌంట్లలోజమ చేస్తామన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ దళితవాడలో శ్రీ జగజ్జనని శ్రీ అంకాళమ్మ తిరుణాల సందర్భంగా ఆదివారం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం అంకాళమ్మ అమ్మవారిని జల్ది నుంచి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగునన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిని రూ. 70వేలు నగదును మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి, మేడా మధుసూధన్‌రెడ్డి ప్రకటించారు. రెండవ బహుమతి రూ. 50 వేలును మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి ప్రకటించారన్నారు. మూడవ బహుమతి రూ. 30 వేలును సిద్దవటం జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, నాల్గవ బహుమతి రూ. 10వేలును ఎస్‌కేఆర్ నగర్ గ్రామ ప్రజలు ప్రకటించారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సివిల్ జడ్జి ఫైజున్నీషా


విద్యార్థులకు సూచనలు చేస్తున్న సివిల్ జడ్జి ఫైజున్నీషా

లక్కిరెడ్డిపల్లి : ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి, మండల లీగల్ అథారిటీ చైర్మన్ షేక్ ఫైజున్నీషా పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డి పల్లిలోని జడ్పీ బాలుర పాఠశాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అన్నం బాగా ఉడికించి విద్యార్థులకు పెట్టాలని, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. లక్కిరెడ్డిపల్లి జడ్పీ పాఠశాలలో చదివిన విద్యార్థులు కలెక్టర్లు, ఎస్పీలుగా ఉన్నత శిఖరాలు అధిరోహించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల తరలింపు


పాఠశాలలకు పుస్తకాలను తరలిస్తున్న ఎంఈఓ సుందర్‌బాబు

రైల్వేకోడూరు : పాఠశాలలు పునప్రారంభం కావడంతో శనివారం మండలంలోని అన్ని పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేసినట్టు విద్యాశాఖ అధికారి సుందర్ బాబు తెలియజేశారు. ఎమ్మార్సీ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. అలాగే పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ పసుపులేని సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల తనిఖీ


టక్కోలి రైతు భరోసా కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : మండలంలోని టక్కోలి, మాచుపల్లె గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, రిజిస్టర్‌లను తనిఖీ చేసి క్షుణ్ణంగా పరిశీంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టక్కోలి రైతు భరోసా కేంద్రంలో 60 బస్తాల యూరియా నిల్వ ఉందన్నారు. అవసరమైన రైతులు పొందవచ్చన్నారు. త్వరలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌సీజన్ ఆశాజనకంగా ఉన్నందున రైతు భరోసా కేంద్రం సహాయకులు ఎళ్ల వేళలా అందుబాటులో ఉండి రైతులకు అన్నీ రకాల సేవలు అందిచాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమగు ఎరువులను వెంటనే ఇండెంట్ పెట్టాలన్నారు. రైతులు పంట రకాల విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లులను తీసుకోవాలని చెప్పారు. రైతులు సమీప రైతు భరోసా కేంద్రంను ఎప్పటి కప్పుడు సంప్రదిస్తూ అన్నీరకాల సేవలను పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్తు



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు, పాల్గొన్న జేఎన్‌టీయూఏ వీసీ శ్రీనివాసరావు, అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట : నాణ్యమైన విద్యతో విద్యార్థుకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేఎన్‌టీయుఏ (అనంతపురం) వైస్‌చాన్సలర్ జీవీఆర్ శ్రీనువాసులు అన్నారు. శనివారం ఏయూలో గ్రాడ్యుయేషన్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. సమయం చాలా విలువైందని, వృథా చేసుకోరాదన్నారు. ఏయూ (అన్నమాచార్య యూనివర్సిటీ) అత్యుత్తమ విద్యా ప్రయోగాలు నెలకొల్పి విద్యార్థులను నిర్దేశిత లక్ష్యసాధనలో మేటిగా నిలుస్తోందని కొనియాడారు. ఏయూ అధినేత చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సామాజిక అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. జ్ఞానాన్ని పెంచుకోవాలని, ఎప్పటికప్పుడు సబ్జెక్ట్ వారీగా అప్‌డేట్‌లో ఉండాలన్నారు. అప్పుడే ఎంచుకున్న విద్యారంగంలో రాణించగలరన్నారు. అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడారు.

930 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

ఏయూలో విద్యను అభ్యసించిన 930 మంది విద్యార్థులకు జేఎన్‌టీయుఏ వీసీ జీవీఆర్ శ్రీనువాసరావు, ఏయూ అధినేత చొప్పా అభిషేక్‌రెడ్డిలు అందచేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మారుతీప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టీఎన్ రంగనాధన్, డీన్స్ మల్లికార్జునరావు, డా.సుబ్బారావు, డా.కృష్ణమోహన్‌రాజు, శివరామిరెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

అలరిస్తున్న మహాభారత యజ్ఞం


మహాభారతాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు, భక్తులు

రామాపురం : మండల కేంద్రమైన రామాపురంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న మహాభారత యజ్ఞానికి విశేష స్పందన లభిస్తుందని మహాభారత ఘట్టాన్ని పగలు సమయంలో హరికథ రూపంలోనూ రాత్రుల సమయంలో పౌరాణిక నాటకాల రూపంలోనూ చెబుతున్నారు. ఈ మహాభారత కథ వినడానికి చుట్టుపక్కల గ్రామస్తులే కాకుండా ఇతర మండలాల నుండి ప్రజల విశేష సంఖ్యలో పాల్గొంటున్నారు. మహాభారత కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులైన ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, భక్తవత్సలరెడ్డి, దామోదర్‌నాయుడులు పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా శ్రీ సాయినాథుని మహోత్సవాలు

రామాపురం : మండల పరిధి నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బారు సాయి నగర్‌లో వెలసిన శిర సమర్థ సద్గురు దర్బారు సాయినాథుని విగ్రహ ప్రతిష్ఠ రజత మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమైయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు చుట్టుపక్కల గ్రామస్తులే కాకుండా ఇతర జిల్లా ప్రాంతాల నుండి కూడా ఎక్కువ సంఖ్యలో హాజరవుతారు. ఆదివారం మహా హోం తీర్థ ప్రసాదాలు ఉచిత అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, ఆలయ కమిటీ సత్యమయ్య స్వామిజీ, శంకరయ్య స్వామిజీలు తెలిపారు.

బాలికల చదువు దేశానికి వెలుగు

రాయచోటి టౌన్ : బాలికల చదువు దేశానికి వెలుగునిస్తుందని గుడ్‌నైబర్స్ ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వరావు తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లాలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఆడపిల్లల తల్లిదండ్రులకు బాలిక చదువు అనే ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని చెప్పారు. న్యాయవాది నాగేశ్వరావు, ఎస్ఐ రమాదేవి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భక్తులకు గాయాలు

ఒంటిమిట్ట: మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువు కట్టపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు భక్తులకు గాయాలయ్యాయి. కర్ణాటకకు చెందిన 10 మంది భక్తులు తిరుమలలో దర్శనం చేసుకుని స్కార్పియో వాహనంలో తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఒంటిమిట్టకు వద్దకు రాగానే కడప నుంచి తిరుపతి వైపు వెళ్తున్న నవత ట్రాన్స్‌పోర్ట్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించారు. మిగతావారిని ఒంటిమిట్టలోని టీటీడీ యాత్రికుల వసతి సముదాయంలో బస కల్పించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.